క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

యాచారం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కొప్పు సుకన్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

నేడు బోరుమోటార్లు, కుట్టు మిషన్ల పంపిణీ

కడ్తాల్: మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఎస్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంపికైన చెంచు లబ్ధిదారులకు బుధవారం బోరుమోటార్లు, కుట్టు మిషన్లు, గేదెల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల్లోపు లబ్ధిదారులు కార్యాలయానికి చేరుకోవాలని ఎంపీడీఓ కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

దేవునిపడకల్‌లో నర్సరీ ప్రారంభం



నర్సరీ సిబ్బందితో సర్పంచ్ శ్రీశైలం

తలకొండపల్లి: మానవాళి మనుగడకు చెట్లే ప్రాణాధారమని సర్పంచ్ కాడమోని శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్‌లో 2024 సంవత్సరానికి సరిపడా మొక్కలు నాటేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నర్సరీని ఏర్పాటు చేశారు. ఈ నర్సరీని మంగళవారం సర్పంచ్ శ్రీశైలం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలన్నారు. విరివిగా మొక్కలు నాటి అడవుల అభివృద్ధికి దోహదపడాలన్నారు. సమృద్ధిగా అడవులు అభివృద్ధి జరిగినప్పుడే సకాలంలో వర్షాలు కురుస్తాయని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జంగయ్య, తిరుపతి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

మంచాల: మండల పరిధిలోని నోముల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠశాలలో తరగతులు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తారి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు బాలునాయక్, నవనీత, విజయ్‌కుమార్, బాలరాజ్, ఐలయ్య, రజినీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందాలి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



స్వాములకు సాయం అందిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: సమాజంలో ఆధ్యాత్మికత, భక్తిభావం మరింత పెంపొందాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్ తండా గ్రామ పంచాయతీకి చెందిన అయ్యప్ప మాలధారణస్వాములకు ఇరుముడి ఖర్చుల నిమిత్తం వైస్ ఎంపీపీ ఆనంద్ సమకూర్చిన రూ.30వేల ఆర్థికసాయాన్ని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ చేతుల మీదుగా స్వాములకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరయ్య, వార్డు సభ్యులు శ్రీను, సేవ్యా, గణేశ్, కిషన్, కోట్యా, రమేశ్, మునేశ్, శ్రీను ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన కిష్టమ్మ (73) మంగళవారం మృతిచెందింది. సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయం అందజేశారు. హనుమాన్ దేవాలయ మాజీ చైర్మన్ నరసింహులుగౌడ్ రూ.2000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, రాములు, హరిమోహన్‌రెడ్డి, రమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపు?

- ప్రాథమిక వ్యవసాయ సంఘానికి సొంత భవనం కరువు
- స్థలం కేటాయింపులో తీవ్ర తాత్సారం
- శిథిల భవనంలో కొనసాగుతున్న కార్యకలాపాలు
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, రైతులు



హయత్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సంఘం కార్యాలయం

హయత్‌నగర్: హయత్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సొంత భవనం లేక సిబ్బంది, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంఘానికి సొంత భవనం కేటాయించాలని ప్రతిపాదనలు పంపించి పదిహేనేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు అధికారుల్లో చలనం లేదు. గతంలో స్థలం కేటాయించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చినప్పటికీ గత పాలకుల పక్షపాత వైఖరి కారణంగా అది ముందుకు సాగలేదు. హయత్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సంఘంలో తన్మగల్ హయత్‌నగర్, బాగ్ హయత్‌నగర్‌తో పాటు అబ్దుల్లాపూర్‌మెట్టు మండలంలోని కుంట్లూర్, తట్టిఅన్నారం, కల్వంచ, పోచంపల్లివాడ, మునుగనూరు, పతుల్లగూడ, హత్తిగూడ రెవెన్యూ గ్రామాలకు చెందిన సుమారు 700 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు.

విత్తనాలు, ఎరువుల అమ్మకాలు లేక..

ఏళ్ల తరబడి సంఘానికి సొంత భవనం లేకపోవడంతో విత్తనాలు, ఎరువుల అమ్మకం జరగడంలేదు. వాటిని తెచ్చుకునేందుకు రైతులు ఇతర సంఘాలపై ఆధారపడాల్సి వస్తోంది. సంఘానికి సొంతంగా కార్యాలయం, గోదాంలను నిర్మించుకునేందుకు హయత్‌నగర్ మండల పరిషత్ ఆవరణలో సుమారు 500 గజాల స్థలాన్ని కేటాయించాలని పదిహేనేళ్ల క్రితం మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో తీర్మానం చేశారు. దీనిపై అప్పటి తహసీల్దార్ కూడా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటివరకు ఈ ప్రక్రియ ముందుకు జరగలేదు. ప్రస్తుతం ఉన్న సంఘం కార్యాలయం శిథిలావస్థకు చేరిన పాత మండల పరిషత్ కార్యాలయంలోనే కొనసాగుతోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి ప్రాథమిక వ్యవసాయ సంఘానికి సొంత భవనం నిర్మించేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

అద్దె అడుగుతున్నారు



ప్రాథమిక వ్యవసాయ సంఘానికి సొంత భవనం లేకపోవడంతో మండల పరిషత్ భవనంలోనే సంఘం కార్యకలాపాలను కొనసాగిస్తున్నాం. ఎప్పుడు కూలుతుందో తెలియని ఈ భవనానికి కూడా అద్దె చెల్లించాలని మండల పరిషత్ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఈ భవనంలో రైతులకు పూర్తిస్థాయిలో సేవలను అందించలేకపోతున్నాం.

– మల్లికార్జున్, సీఈఓ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, హయత్‌నగర్

స్థలం కేటాయించాలి



ప్రాథమిక వ్యవసాయ సంఘానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి ఇచ్చిన ఫైల్ దొరకడం లేదని అధికారులు చెబుతున్నారు. ఫైల్ కోసం ఏళ్లతరబడి తిరిగినా ఫలితం దక్కడం లేదు. మండల పరిషత్ ఆవరణలో స్థలం కేటాయిస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– చామ కృష్ణారెడ్డి, చైర్మన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, హయత్‌నగర్

ఎమ్మెల్యే కసిరెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కసిరెడ్డి నారాయణరెడ్డిని పలువురు ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డిని ఆమనగల్లు చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు కోట కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.పరీక్షిత్ నరేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి హెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్లు వేణు, శేఖర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన కార్తీకమాస ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శివలింగం

ఇబ్రహీంపట్నం: హిందువులు పవిత్ర మాసంగా భావించే కార్తీకమాస ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. శివకేశవులను ఈనెలలో ఆరాధిస్తారు. ఇబ్రహీంపట్నంలోని శ్రీ నాగలింగేశ్వర, శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక సోమవారాల్లో శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, దీపోత్సవాలను, భజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్తీకమాసంలో చెట్లను పూజించడం.. అందులో భాగంగా వనభోజనాలు చేస్తుంటారు. అయ్యప్ప భక్తులు ఈ మాసంలో అధికంగా మాలలను ధరించారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరండి

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కసిరెడ్డి నారాయణరెడ్డి విజయోత్సవ ర్యాలీని బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు శెట్టిపల్లి సత్యం తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజయోత్సవ ర్యాలీ ప్రారంభమవుతుందని అనంతరం ఆమనగల్లు, వెల్దండ మండలాల మీదుగా కల్వకుర్తి వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని సత్యం కోరారు.

కల్వకుర్తి పట్టణం వరకు..

తలకొండపల్లి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బుధవారం ఉదయం 9 గంటలకు కడ్తాల్ మండల కేంద్రంలో ప్రారంభమై, ఆమనగల్లు పట్టణం మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణం వరకు ర్యాలీ కొనసాగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, సీనియర్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరవుతున్నారని ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శరవేగంగా డివిజన్ల అభివృద్ధి

మేయర్ చిగురింత పారిజాతరెడ్డి



మేయర్ పారిజాతరెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లో ఉన్న డ్రీమ్ సిటీలో బీటీ రోడ్డు పనులను మేయర్ చిగురింత పారిజాతరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు వేగంగా పుంజుకుంటాయన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు పథకాలు ఇప్పటికే అమలు చేసి ప్రజల్లో మన్ననలు పొందుతున్నారన్నారు.కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూస్తామన్నారు. అనంతరం కాలనీవాసులు మేయర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మనోహర్, బాలునాయక్, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక బాటలో నడవాలి



ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి

కందుకూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక బాటలో నడవాలని, అప్పుడే సమాజంలో శాంతి వెల్లివిరుస్తాయని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి సూచించారు. మంగళవారం మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానంతో పాటు ఆశీర్వాదాలు అందించారు. ఈసందర్భంగా ఆయన భక్తులకు ప్రవచనాలు చేశారు. ఆధునిక సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి పురోగమించాలంటే నిత్యం సాధన అవసరమన్నారు. తమతో పాటు పది మందికి ఉపయోగపడేలా నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్మికుల పాత్ర కీలకం

సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి



కార్మికులకు సామగ్రి అందజేస్తున్న సర్పంచ్

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్మికుల పాత్ర కీలకమని కడ్తాల్ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం కడ్తాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో సర్పంచ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్లాస్టిక్ నిర్మూలన, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య నిర్వాహణ కార్యక్రమాల తీరుపై సమగ్రంగా వివరించారు. అనంతరం పంచాయతీ కార్మికులు, సిబ్బందికి గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులతో కలిసి సబ్బులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డ సభ్యులు నరేందర్‌రెడ్డి, మల్లయ్య, భిక్షపతి, సువర్ణ, గణేశ్, బుజ్జి, వెంకటయ్యగౌడ్, రాంచంద్రయ్య, కార్యదర్శి రాఘవేందర్ ఉన్నారు.

ఇంటెలిజెన్స్ చీఫ్‌ను కలిసిన రమేష్



ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమితులైన అడిషనల్ డీజీ భత్తుల శివధర్‌రెడ్డిని మంగళవారం ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామానికి చెందిన శివధర్‌రెడ్డి ఇంటెలిజెన్స్ చీఫ్ కావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో డీజీపీ కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి: కార్పొరేటర్



బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని హస్తినాపురం కార్పొరేటర్ భానోతు సుజాతానాయక్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం ఆమె డివిజన్ పరిధి అగ్రికల్చర్ కాలనీలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని ప్రతికాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కాలనీవాసులు తమ కాలనీలోని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎఈ హేమునాయక్, కాలనీవాసులు తాండ్ర మణిపాల్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఎంపీపీ పద్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మారెడ్డి

మాడ్గుల: మండల పరిషత్ కార్యలయలో ఎంపీపీ పద్మారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. అధికారులు విభాగాలవారీగా ఎజెండా చదువుతూ సాధించిన ప్రగతి వివరాలను వెల్లడించారు. సర్పంచ్‌లు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోల్కులపల్లి ఎంపీటీసీ సభ్యుడు బట్టు కిషన్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు విద్యుత్ సమస్యల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తునారని తెలుపగా.. ఏఈ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. సిబ్బంది కొరత ఉందని భవిష్యత్‌లో సమస్యలు రాకుండా చూస్తామాని తెలిపారు. సభ్యులు స్థానికంగా ఉన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో మండల వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, సింగిల్ విండో చెర్మన్ తిరుమల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జైపాల్ రెడ్డి, బట్టు కిషన్ రెడ్డి, లక్ష్మి, భారతి, నారమ్మ, పాండుగౌడ్, చంటి, వెంకటయ్య, తహసీల్దార్ నిరంజన్ రావు, ఏఓ గౌతమ్, ఎంపీడీఓ, ఎంఈఓ, అన్నిశాఖల ఏఈలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు

ముగిసిన బుగ్గ జాతర



జాతరకు తరలివచ్చిన భక్తులు

మంచాల: గత పదహారు రోజులుగా కొనసాగిన శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి జాతర మంగళవారంతో ముగిసింది. ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగిన ఈ జాతరలో సుమారు లక్షా యాభైవేల మంది భక్తులు హాజరయ్యారు. ఇక్కడికి వచ్చి పుణ్య స్నానాలు, కార్తీక దీపారాధన చేసిన భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైద్యశాఖ, స్థానిక ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు జాతరలో పికెటింగ్ ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసేవలు అందించారు. పోలీసు శాఖ వారు రెండు,మూడు చోట్ల ప్రత్యేక పికెటింగ్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఇబ్రహీంపట్నం నుంచి శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతరకు ఆర్టీసీ బస్సులను నడిపించారు. రంగారెడ్డి, హైదరాబాద్ నల్లగొండ, భువనగిరి జిల్లాలతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. జాతర ఉత్సవాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి.

మల్‌రెడ్డిని కలిసిన నందకిషోర్



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మంగళవారం నియోజకవర్గ ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు నందకిషోర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానని ఈ సందర్భంగా మల్‌రెడ్డి అన్నారు. పార్టీ అనుబంధ సంస్థలు మరింత పటిష్ఠం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

కాలనీలో నీటి ఎద్దడిని నివారించండి



జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న మధుయాష్కీ, కాలనీవాసులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లోని రోషన్‌దౌల్తాలో తాగునీటి ఎద్దడిని నివారించాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీ గౌడ్ మంగళవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా యాష్కీ మాట్లాడుతూ, రోషన్‌దౌల్తా బస్తీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో బస్తీనిద్ర చేయటంతో సమస్యలను బస్తీవాసులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. స్పందించిన దానకిషోర్ సంబంధిత జోనల్ మేనేజర్‌ను పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారన్నారు. రక్షణశాఖ అధికారులతో చర్చించి తక్షణమే తాత్కాలిక నల్లా కనెక్షన్లు ఇవ్వాలని, ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాలని అధికారులను దానకిషోర్ ఆదేశించారని ఆయన స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేని కలిసిన తూర్పుకాలనీల నాయకులు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మరోసారి విజయం సాధించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని వనస్థలిపురం తూర్పు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత సుధీర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో ఎల్‌బీనగర్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. అధ్యక్షుడు దీపావళి శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గుత్తా లక్ష్మణ్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అయిళ్ల'కు సముచిత స్థానం కల్పించాలి

ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో గత 25 సంవత్సరాలుగా కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్న టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని ఆ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా దాదాపు రెండున్నర దశాబ్దాలుగా శ్రీనివాస్‌గౌడ్ కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తను వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ.. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తుచేశారు. పీఏసీఎస్ చైర్మన్‌గా, రెండుసార్లు ఏకగ్రీవంగా ఎంపీటీసీగా ఎన్నికై అనేక ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టారన్నారు. తృటిలో ఆమనగల్లు ఎంపీపీ పదవి తప్పిపోయిన, ఏ రోజు కూడా వెనుకడుగు వేయకుండా నియోజకవర్గంలోని ప్రతి తండాలో, గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషిచేశాడని అన్నారు. కల్వకుర్తి టికెట్ ఆశించి అది రాకపోయినప్పటికీ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపుకోసం శ్రీనివాస్‌గౌడ్ అహర్నిషలు కృషిచేశారన్నారు. పార్టీ అధిష్టానం శ్రీనివాస్‌గౌడ్ పార్టీకి అందించిన సేవలను గుర్తించి ఎమ్మెల్సీ పదవి లేదా ఇతర ఉన్నత పదవి ఏదైనా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, రాజు, మల్లేశ్, వీరయ్య, అర్జున్, యాదయ్య, హరిశ్చంద్ర, రాఘవేందర్, పురుషోత్తం, చెన్నయ్య, జయకృష్ణ, వెంకటయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 19, వంకాయ 35, బెండ 55, పచ్చిమిర్చి 28, కాకర 45, బీర 55, క్యాబేజి 15, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 37, దొండ 35–40, చిక్కుడు 23–55, గోకర 50, బీట్‌రూట్ 33, క్యాప్సికం 55, ఆలు 23, దోస 28, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 38, చామగడ్డ 40. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.